
## నేడు ఎమ్మెల్యేగా కడియం శ్రీహరి ప్రమాణ స్వీకారం



స్టేషన్ ఘన్‌పూర్, డిసెంబర్ 8 : గత నెల 30న జరిగిన అసెంబ్లీ ఎన్నికలలో స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గం నుంచి బీఆర్‌ఎస్ అభ్యర్థిగా పోటీ చేసి గెలుపొందిన కడియం శ్రీహరి నేడు ప్రమాణ స్వీకారం చేయనున్నారు. 1994లో స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యేగా మొదటి సారిగా గెలిచిన కడియం, ఎమ్మెల్యేగా, ఎంపీగా, డిప్యూటీ సీఎంగా, ఎమ్మెల్సీగా పదవులు చేపట్టి ఆ పదవులకే వన్నె తెచ్చారు. నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే కాకుండా, నియోజకవర్గంలోని సాగునీటి సమస్య పరిష్కారానికి దేవాదుల ప్రాజెక్టును తీసుకువచ్చారు. నీతివంతమైన పాలనతో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసి ప్రజల్లో స్థానం సంపాదించుకున్న కడియం శ్రీహరి నేడు(శనివారం) ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. దీంతో నియోజకవర్గ ప్రజలతోపాటు ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రజలు సైతం హర్షం వ్యక్తం చేస్తున్నారు. నేటి కడియం శ్రీహరి ప్రమాణ స్వీకారోత్సవానికి నియోజకవర్గానికి చెందిన బీఆర్‌ఎస్ ముఖ్యశ్రేణులు, కడియం అభిమానులు పెద్ద ఎత్తున తరలివెళ్లనున్నారు.



అమ్మవారికి పుస్తెలు అందజేస్తున్న అర్చకుడు లక్ష్మన్న కుటుంబ సభ్యులు



## శ్రీచండికా అమ్మవారికి బంగారు పుస్తెలు సమర్పణ

పాలకుర్తి డిసెంబర్ 8 : పాలకుర్తిలోని స్వయంభు సోమేశ్వర లక్ష్మీనరసింహస్వామి క్షీరగిరి క్షేత్రంలో కొలువుదీరిన శ్రీచండికా అమ్మవారికి సుమారు 14గ్రాముల బంగారు పుస్తెల ను శుక్రవారం ఆలయ ఉపప్రధానార్చకులు దేవగిరి లక్ష్మన్న కుటుంబ సభ్యులు సమర్పించినట్లు ఆలయ ఈవో భాగం లక్ష్మీప్రసన్న తెలిపారు. బంగారు పుస్తెల విలువ సుమారు రూ.82వేలు ఉంటుందని ఆమె తెలిపారు. శ్రీసూక్త విదానేనా పూజ చే సి అమ్మవారికి అలంకరించినట్లు ఈవో చెప్పా రు. అలయ అర్చకలు, సిబ్బంది పాల్గొన్నారు.

## వ్యాసరచన పోటీల్లో విజేతకు సత్కారం

వరంగల్ చౌరస్తా, డిసెంబర్ 8: జిల్లా స్థాయి వ్యాసరచన పోటీల్లో బంగారు పతకాన్ని గెలుచుకున్న అలిజా మైరాను భారతీ చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. మట్టెవాడ ఎస్ఆర్ డట్టన్స్ హైస్కూల్‌లో ఆరో తరగతి చదువుతున్న అలిజా మైరా గత వారం టాటా గ్రూప్ ఆఫ్ కంపెనీస్ వారు జిల్లా స్థాయిలో 'వాతావరణ పరిరక్షణ మార్గాలు' అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో పాల్గొని బంగారు పతకాన్ని సాధించడంతో చిన్నారితోపాటు ప్రోత్సహించిన తండ్రి అఫ్జల్ పాషాను శుక్రవారం ఘనంగా సత్కరించినట్లు చారిటబుల్ ట్రస్టీ డాక్టర్ రాజేంద్రప్రసాద్ తెలిపారు. ట్రస్ట్ ప్రతినిధులు, జన్ను మాణిక్యం, శ్రీను, శబరి, ఖాధర్, రాము, యాకుబ్, శ్యాం పాల్గొన్నారు.

## ఆల్ ఇండియా కుస్తీ పోటీలకు ప్రీతమ్ ఎంపిక

దామెర, డిసెంబర్ 8: మండలంలోని తక్కళ్లపహాడ్‌కు చెందిన సీహెచ్ ప్రీతమ్ ఆల్ ఇండియా కుస్తీ పోటీలకు ఎంపికయ్యాడు. ఈనెల 25న హనుమకొండలోని జవహర్ లాల్ నెహ్రూ స్టేడియంలో జరిగిన యూనివర్సిటీ పోటీల్లో 60కేజీల విభాగంలో ఉత్తమ ప్రతిభ కనబరిచాడు. పంజాబ్‌లో సౌత్ వెస్ట్ జోన్ పోటీల్లో విజేతగా నిలిచాడు. దీంతో ఆల్ ఇండియా కుస్తీ పోటీలకు ఎంపికయ్యాడు. తన ఎంపికకు సహకరించిన కోచ్ కే రాజుతోపాటు ప్రతి ఒక్కరికీ ప్రీతమ్ కృతజ్ఞతలు తెలిపాడు.

# కనుల పండువగా పల్లివేట

- పెద్ద సంఖ్యలో హాజరైన భక్తులు
- మున్సిపల్ ఆఫీస్ ఆవరణలో అభిషేకాలు



అయ్యప్ప స్వామిని పల్లివేటకు తోడుకుని వెళ్తున్న స్వాములు

నర్సంపేట, డిసెంబర్ 8: పట్టణంలో అయ్యప్పస్వామి పల్లివేట శుక్రవారం కనులపండువగా జరిగింది. ఆలయం నుంచి మున్సిపల్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన బృందావనానికి స్వామి వారిని తీసుకెళ్లి వేట కార్యక్రమాన్ని నిర్వహించారు. సర్వ సైన్యాధ్యక్షుడు రాణాప్రతాప్‌రెడ్డి కుటుంబ సమేతంగా హాజరు కాగా, అయ్యప్ప స్వామికి గురుస్వామి వెంకటేశ్‌శర్మ అభిషేకాలు నిర్వహించారు. పల్లకీ సేవను మున్సిపల్ చైర్‌పర్సన్ గుంటి రజినీ కిషన్ ఆధ్వర్యంలో మహిళలు వైభవంగా చేశారు. పట్టణంలో స్వామి వారిని ర్యాలీగా చతురంగ బలాలతో భక్తి పారవశ్యంతో వెళ్లారు. అయ్యప్ప స్వాములు నృత్యాలు చేస్తూ ర్యాలీలో పాల్గొన్నారు. అన్నదాతలు గోగుల ప్రతాపరెడ్డి, జయశ్రీ, గోగుల రాణాప్రతాప్‌రెడ్డి, లక్ష్మీభార్గవి, జనగం రామారావు, సాంబలక్ష్మి, వడ్డురి తిరుమలాచారి, గుజ్జుల మాధవరెడ్డి, పద్మ, ఆలయ కమిటీ చైర్మన్ శింగిరికొండ మాధవశంకర్, మాదారపు చంద్రశేఖర్, దొడ్డ రవీందర్, శ్రీరాంఈశ్వరయ్య, చింతల కమలాకర్ రెడ్డి, శ్రీరాముల శంకరయ్య, భూపతి లక్ష్మీనారాయణ, దొడ్డ వేణు, మల్యాల రాజు, శింగిరికొండ వేణుగోపాల్, పబ్బ రమేశ్, శ్రీనివాస్, నాగరాజు పాల్గొన్నారు.

## నేడు మాదన్నపేట పెద్దచెరువు వద్ద పంబారట్టు

### హాజరు కానున్న మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి, స్వప్న దంపతులు



మాదన్నపేట పెద్ద చెరువు వద్ద పంబారట్టు చేసే ప్రదేశం

నర్సంపేట రూరల్: నర్సంపేట ధర్మశాస్త్ర అయ్యప్పస్వామి దేవాలయంలో 23వ మండల పూజ మహోత్సవాల్లో భాగంగా మండలంలోని మాదన్నపేట పెద్ద చెరువులో శనివారం గురుస్వామి సీ వేంకటేశ్‌శర్మ వేదమంత్రోచ్చారణల నడుమ పంబారట్టు వైభవంగా నిర్వహించనున్నారు. కేరళ రాష్ట్రం పంపా నదిలో అయ్యప్ప జలక్రీడలు ఏవిధంగా జరుగుతాయో ఇక్కడ అదే రీతిలో ఏటా జరుగుతాయి. వేలాది మంది దీక్షాపరులు, భక్తులు హాజరవుతారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలతోపాటు ఇతర జిల్లాల నుంచి వేలాదిగా అయ్యప్పస్వాములు రానున్నారు. అయ్యప్పస్వామి జలక్రీడలు తర్వాత మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి, జడ్పీ ఫ్లోర్‌లీడర్ పెద్ది స్వప్న దంపతులు అందించనున్న పంబా సద్ది (మహా అన్నదానం)ని మాదన్నపేట పెద్ద చెరువుకట్టపై మాలధారులు, భక్తులు సహపంక్తి భోజనం చేయనున్నారు. 18క్వింటాళ్లతో మహా అన్నదాన కార్యక్రమానికి ఏర్పాట్లు చేశారు. మాదన్నపేట పెద్ద చెరువు వద్ద ఏర్పాట్లను శుక్రవారం గురుస్వామి సీ వెంకటేశ్‌శర్మతోపాటు అఆలయ కమిటీ సభ్యులు పరిశీలించారు. అయ్యప్ప స్వామి పంబా ఆరట్టు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆలయ కమిటీ చైర్మన్ శింగిరికొండ మాధవశంకర్ తెలిపారు.

# పోచమ్మ, ఎల్లమ్మ ఆలయాల్లో చోరీ

- బంగారు, వెండి ఆభరణాల అపహరణ
- మాందారిపేటలో ఘటన

శాయంపేట, డిసెంబర్ 8: మండలంలోని మాందారిపేట ఎల్లమ్మ, పోచమ్మ ఆలయాల్లో గురువారం అర్ధరాత్రి చోరీ జరిగింది. ఎస్సై దేవేందర్, స్థానికుల కథనం ప్రకారం.. గ్రామంలో ఎల్లమ్మ తల్లి విగ్రహాన్ని మూడు రోజుల క్రితం ఘనంగా ప్రతిష్ఠించగా, గుర్తుతెలియని వ్యక్తులు గుడి తాళం పగులగొట్టి అమ్మవారి విగ్రహానికి అలంకరించిన జత బంగారు కమ్మలు, రెండు బంగారు పుస్తెలు, రెండు గ్రాముల వెండి మట్టెలు ఎత్తుకెళ్లారు. పక్కనున్న పోచమ్మ గుడిలోని అమ్మవారి విగ్రహానికి ఉన్న జత బంగారు కమ్మలు, బంగారు ముక్కు పుడక, బంగారు బొట్టు బిల్ల ఎత్తుకెళ్లారు. ఆలయంలో గౌడ కుల పెద్దమనిషి గాజర్ల సదానందం శుక్రవారం ఉదయం దీపం పెట్టేందుకు వెళ్లగా తాళం పగులగొట్టి ఉండగా సమాచారం అందించాడు. మొత్తం 16 గ్రాముల బంగారం, రెండు గ్రాముల వెండి ఆభరణాలు అపహరణకు గురయ్యాయని, వాటి విలువ రూ.80వేలు ఉంటుందని ఎస్సై తెలిపారు. గౌడ కుల సంఘం పెద్దమనిషి సదానందం, పోచమ్మ ఆలయ పూజారి నవీన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.



రేవూరికి బొకే అందిస్తున్న నాయకులు

## 'రేవూరి'కి నడికూడ నాయకుల శుభాకాంక్షలు

నడికూడ, డిసెంబర్ 8: పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డికి నడికూడ మండల నాయకులు శుక్రవారం హనుమకొండలోని ఆయన నివాసంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. మండల విషయాలను వారికి తెలియజేశారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బుర్ర దేవేందర్, ప్రధాన కార్యదర్శి మలహాల్‌రావు, యూత్ అధ్యక్షుడు అప్పం కుమారస్వామి, వర్కింగ్ ప్రెసిడెంట్ వనపర్తి నవీన్, రావుల సురేశ్, మహిళా అధ్యక్షురాలు భోగం కమల, సదానందం, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

# ఆరు గ్యారెంటీలను అమలు చేస్తాం

### భూపాలపల్లి ఎమ్మెల్యే సత్యనారాయణరావు

శాయంపేట, డిసెంబర్ 8: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. మండలంలోని మైలారంలో ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. ఆరు గ్యారెంటీల్లో ఒకటైన మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం శనివారం నుంచి ప్రారంభమవుతుందని తెలిపారు. ఆరోగ్యశ్రీ పథకాన్ని రూ.10లక్షలకు పెంచినట్లు పేర్కొన్నారు. పరకాల మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పోలెపల్లి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ మండల జడ్పీటీసీ చల్ల చక్రపాణి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి, మారెపల్లి బుజ్జన్న, దుబాసి కృష్ణమూర్తి, మిరుపల్లి కృష్ణ పాల్గొన్నారు.




ఎమ్మెల్యేకు బొకే అందిస్తున్న నాయకులు

## హనుమకొండలో కలిసిన నాయకులు

భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావును శాయంపేట మండలానికి చెందిన కాంగ్రెస్ నాయకులు శుక్రవారం హనుమకొండలోని నివాసంలో కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు. మాజీ వార్డు సభ్యుడు పత్తి శ్రీనివాస్, చిందం రవి, మారెపల్లి బుజ్జన్న, మార్కండేయ, ప్రపంచరెడ్డి ఉన్నారు.

## మంత్రి కొండా సురేఖను కలిసిన ఎంపీపీ

గీసుగొండ, డిసెంబర్ 8: మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన తూర్పు ఎమ్మెల్యే కొండా సురేఖను శుక్రవారం హైదరాబాద్‌లోని ఆమె నివాసంలో గీసుగొండ ఎంపీపీ భీమగాని సౌజన్య మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. నాయకులు నల్ల సురేశ్‌బాబు పాల్గొన్నారు.



మంత్రికి పుష్పగుచ్ఛం అందిస్తున్న తెలుపుతున్న ఎంపీపీ సౌజన్య

## ఎమ్మెల్యే దొంతికి ఘన సన్మానం

నర్సంపేట రూరల్, డిసెంబర్ 8: పట్టణంలోని ద్వారకపేట ఎంఏఆర్ ఫంక్షన్‌హాల్‌లో శుక్రవారం ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డిని పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఘనంగా సన్మానించారు. నూతన ఎమ్మెల్యేగా ఎన్నికై తొలి సారిగా నర్సంపేటకు వచ్చినందున ఆయన్ను నియోజకవర్గంలోని కాంగ్రెస్ నాయకులు ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన అభినందన సభలో ఆయన మాట్లాడారు. ముఖ్యనాయకులు తక్కళ్లపెల్లి రవీందర్ రావు, పాలాయి శ్రీనివాస్, వేముల సాంబయ్య, ఓర్సు తిరుపతి, గోపాల్‌నాయక్, లక్ష్మణ్‌నాయక్, గజ్జి రాజు, సంజీవరెడ్డి, ఆనంద్, యాకూబ్‌రెడ్డి, రంజిత్‌రెడ్డి, రతన్ ఉన్నారు.



ఎమ్మెల్యే దొంతిని సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

# మంచుదుప్పటి..

నర్సంపేట రూరల్/శాయంపేట/నడికూడ, డిసెంబర్ 8: పొగమంచు శుక్రవారం ఉదయం దుప్పటిలా కప్పేసింది. తెల్లవారుజాము నుంచి 8.30గంటల వరకు తొలగలేదు. జనం అప్పటి వరకు బయటకు రాలేకపోయారు. చిరువ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పాలు, కూరగాయల వ్యాపారులు పొగ మంచులో వాహనాల లైట్లు వేసుకొని వెళ్లారు. మూడు రోజులుగా తుఫాన్ ప్రభావంతో వానలు కురవగా శుక్రవారం తేరుకుంది. ఈ క్రమంలో పొగమంచు దట్టంగా అల్లుకోవడంతో ధాన్యం వద్ద రైతులు ఇబ్బందులు పడ్డారు. చలి పెరగడంతో వృద్ధులు, పిల్లలు అవస్థలు పడ్డారు. పరకాల పట్టణం, నడికూడ మండలంలో విపరీతంగా పొగమంచు కురవడంతో రోడ్డుపై వెళ్లేందుకు వాహనదారులు ఇబ్బందులు పడ్డారు.



శాయంపేట: మంచుతో ఉన్న బస్టాండ్ ప్రాంతం



నడికూడలో పొగమంచుతో కూడిన రోడ్డు




నర్సంపేట రూరల్: మంచులో లైట్లు వేసుకొని వెళ్తూ..